మాధవరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్సీ పీఎంఆర్


మాధవరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి

వనస్థలిపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని భూలక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి సామాజికవేత్త పటోళ్ల మాధవరెడ్డి ఇటీవల ముక్కుకు సర్జరీ అయింది. దీంతో ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న మాధవరెడ్డిని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి వికారాబాద్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీత, పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు.


ప్రారంభోత్సవం అనంతరం ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి, సెషన్స్ జడ్జి పట్టాభిరామారావుతో అసోసియేషన్ ప్రతినిధులు

బార్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

ఎల్‌బీనగర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పునర్నిర్మించిన రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయాన్ని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి డాక్టర్ పట్టాభిరామారావు, న్యాయవాదుల సొసైటీ డైరెక్టర్ సాయిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, కార్యదర్శి మాధవరెడ్డి, ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు

చంపాపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని అనుపమనగర్ కాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి సహిత గణపతి, సూర్య అంబిక, భవాని శంకరస్వామి చతుర్థ బ్రహ్మోత్సవాలు సోమవారం భక్తి శ్రద్ధలతో ఆరంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కె.వెంకట్‌రెడ్డి దంపతులు, డి.శేఖర్‌రెడ్డి, హనుమప్రసాద్, జి.వెంకట్‌రెడ్డి, ఆలయకమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహాల ప్రతిష్ఠ, కల్యాణోత్సవాలు


కంఠమహేశ్వర స్వామి నూతన ఆలయం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ కంఠమహేశ్వర స్వామి సురమాంబదేవి విగ్రహ ప్రతిష్ఠతోపాటు కల్యాణోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 14న విగ్రహాల ఊరేగింపు, సాయంత్రం జలాధివాసం, 15న జల బిందెలు తీయుట, గణపతి పూజాతో పాటు పలు ప్రత్యేక పూజలు, అనంతరం నూతన విగ్రహాల ప్రతిష్ఠ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 16న అష్టదిగ్బంధనం, పొలిమేరకట్టు, గ్రామ దేవతల పూజలు, మధ్యాహ్నం అమ్మవారికి బోనాలు సమర్పణ, రాత్రి 7 గంటల తర్వాత స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. 17న అమ్మవారికి పూజలు ఉంటాయన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించాలి : సీపీఎం



ఎస్‌బీఐ బ్యాంకు శాఖ ఎదుట ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

హయత్‌నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో తుర్కయంజాల్‌లోని ఎస్‌బీఐ బ్యాంకు శాఖ ఎదుట ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఎం జిల్లా కార్యదర్శి కె.భాస్కర్ హాజరై, మాట్లాడారు. ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించాలని సుప్రీంకోర్టు ఆదేశించినా ఎస్‌బీఐ నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని శాఖ మేనేజర్‌కు అందజేశారు. సీపీఎం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కన్వీనర్ డి.కిషన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సామేల్, జగదీష్, నరసింహ, రవికుమార్, ఆలంపల్లి నరసింహ, నాయకులు ప్రకాష్ కారత్, శంకర్, ప్రణయ్, చరణ్, రుద్ర కుమార్, కుర్మయ్య, ఎల్లేష్, వెంకన్న, విజయ్‌కుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ నాయకులతో సమావేశమైన హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత

పాతబస్తీలో బీజేపీ గెలుపు ఖాయం

సంతోష్‌నగర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈసారి పాతబస్తీలో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయం అని బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి డా. మాధవీలత అన్నారు. సోమవారం యాకత్‌పుర నియోజకవర్గ నాయకులతో కలిసి ఆమె మాట్లాడారు. పాతబస్తీలో ఓవైసీ కుటుంబపాలనకు అంతిమ ఘడియలు మొదలయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేందర్‌యాదవ్, కన్వీనర్ ధీరజ్‌లాల్, నాయకులు మన్నె శ్రీనివాస్, అమర్‌నాథ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రేణు తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ సుజాతానాయక్‌ను సన్మానిస్తున్న మహిళలు


మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: కార్పొరేటర్

చంపాపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని భాగ్యనగర్‌కాలనీ ఫేస్-1లో ఆదివారం రాత్రి మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాలనీ మహిళలు కార్పొరేటర్‌కు బొకే అందజేసి ఘనంగా సన్మానించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ మహిళలు పురుషులతో పాటు సమానంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు పాల్గొన్నారు.

దుబ్బకుంట మాయం

ప్లాట్లుగా మార్చిన రియల్ వ్యాపారి

రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జా కోరల్లో మరో కుంట చేరింది. పెరిగిన భూముల ధరలను ఆసరాచేసుకుని వ్యాపారులు చెరువులను, కుంటలను సైతం వదల కుండా దర్జాగా ఆక్రమిస్తున్నారు. తాజాగా నగర శివారు తుర్కయంజాల్ గ్రామానికి ఆనుకుని వందల సంవత్సరాలుగా ఉన్న దుబ్బకుంటను నేడు నామరూపాలు లేకుండా చదును చేశారు. ఆనవాలు కనిపించకుండా కుంటను మట్టితో నింపేశారు. ప్లాట్లు చేసి రాళ్లను పాతారు. ఇప్పటికే రాగన్నగూడలోని గంగరాయి చెరువు, మన్నెగూడలోని ఎర్రకుంట, చింతలకుంట, కొత్త చెరువులు కబ్జా చెరలోకి వెళ్లి పోయాయి. తాజాగా తుర్కయంజాల్ దుబ్బకుంట ఖతమైంది.


పూడ్చక ముందు తుర్కయంజాల్‌లోని దుబ్బకుంట


ప్లాట్లుగా మారిన తరువాత..

హయత్‌నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్‌లోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 631లో సుమారు 90 ఎకరాల వరకు ఉంటుంది. అందులోని కొంత భాగం గ్రామస్తులు ఇళ్లను నిర్మించుకున్నారు. గ్రామానికి ఆనుకుని సర్వే నంబర్ 631తోపాటు పట్టా సర్వే నంబర్ 612లో దుబ్బకుంట విస్తరించి ఉంది.

గ్రామస్తుల అవసరాలు తీరుస్తున్న కుంట

గ్రామానికి ఆనుకుని దుబ్బకుంట ఉండడంతో పశువులు అందులోనే నీరు తాగుతాయి. అదేవిధంగా స్థానికంగా భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడానికి ఈ కుంట ఎంతో ఉపయోగపడుతోంది. గ్రామప్రజల అవసరాల కోసం కుంట ఒడ్డున చేతి పంపును వేశారు. గతంలో గ్రామస్తులు చేతి పంపు నీరునే తాగేవారమని పలువురు తెలిపారు. కుంటను చదును చేయడంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ మూడు రోజుల నుంచి చదను...

దాదాపు 20 సంవత్సరాల క్రితమే తుర్కయంజాల్‌లోని భూములన్నీ ప్లాట్లుగా మారాయి. అప్పట్లోనే దుబ్బకుంటను కూడా ఆక్రమించడానికి జరిగిన ప్రయత్నాలను గ్రామస్తులు ముక్తకంఠంతో వ్యతిరేకించడంతో సదరు రియల్ వ్యాపారి వెనకడుగు వేశాడు. అప్పటి నుంచి అలాగే ఉన్న వ్యాపారి మూడు రోజులుగా మళ్లీ తన ప్రయత్నాలను ప్రారంభించాడు. అందులో భాగంగా దుబ్బకుంటకు ఉన్న కట్టను మొత్తం చదునుచేసి కట్ట ఆనవాలు లేకుండా చేశారు.


ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు


గ్రామ ప్రజల అవసారాల కోసం కుంట ఒడ్డున ఏర్పాటు చేసిన చేతి పంపు

కలెక్టర్‌కు ఫిర్యాదు

దుబ్బకుంటను కబ్జా చేస్తున్న విషయాన్ని తుర్కయంజాల్‌కు చెందిన పలువురు గ్రామస్తులు సోమవారం రంగారెడ్డి కలెక్టర్‌కు, ఇబ్రహీంపట్నం ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ దుబ్బకుంటను కబ్జా నుంచి కాపాడాలని వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో బచ్చిగళ్ల రమేష్, మేతరి కుమార్, జి.శ్రీనివాస్, గుడ్ల అర్జున్, కె.దర్శన్, మేతరి యాదగిరి, తదితరులు ఉన్నారు.

మా వద్ద రికార్డుల్లో కుంట లేదు..

తమ వద్ద రికార్డుల్లో కుంట ఎక్కడ కూడా లేదు. టోపోషీట్‌లో కూడా కనిపించడం లేదు. కుంటలో మాత్రం ప్రభుత్వ భూమి ఉంది. రెవెన్యూ, సర్వే అధికారులను సర్వే చేయమని చెప్పారు.

- తాస్వీన్ రజా, ఏఈ, ఇరిగేషన్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం

ఇంటి భోజనం ఆరోగ్యానికి మంచిది

సెలబ్రిటీ న్యూట్రిషియనిస్ట్ రుజుతా దివేకర్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సెలబ్రిటీ న్యూట్రిషనిస్ట్ రుజుతా దివేకర్, ఫ్లో సభ్యులు

హైదరాబాద్ సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తమ ప్రాంతంలో దొరికే, సీజనల్ ఫుడ్స్‌తో పాటుగా మరీ ముఖ్యంగా ఇంటి భోజనం ఆరోగ్యానికి మంచిదని సెలబ్రిటీ న్యూట్రిషనిస్ట్ రుజుతా దివేకర్ అన్నారు. బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో) హైదరాబాద్ చాప్టర్ ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నలభై ఏళ్ల వయసు నుంచే ఆరోగ్య పరంగా గణనీయంగా మార్పులు చోటు చేసుకుంటాయని, ఈ వయసులో మహిళల కోసం 40+ మంత్ర వివరించారు. సరిగా తినకపోతే లేదంటే తినాల్సిన ఆహారం తినకపోతే పీరియడ్స్ సమస్యలు వచ్చే అవకాశాలున్నాయని ఆమె వివరించారు. ఆకుకూరలు, శెనగలు, పెసరపప్పు, అరటి పండ్లు లాంటి తాజా పండ్లు లాంటివి తీసుకోవాలని సూచించారు. మంచి నిద్ర సౌందర్యానికి ముఖ్యమని, ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరని ఆమె సూచించారు. నేటి జీవనశైలి ఆరోగ్య సమస్యలు, వాటికి కారణాలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఫ్లో హైదరాబాద్ చైర్ పర్సన్ రీతు షాతో పాటుగా పెద్ద సంఖ్యలో ఫ్లో సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకట్‌రెడ్డి


మధుయాష్కీగౌడ్‌చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న వెంకట్‌రెడ్డి

మన్సూరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మన్సూరాబాద్‌కు చెందిన జాలె వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నియామక ఉత్తర్వులు విడుదల చేయగా.. టీపీసీసీ ప్రచారకమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సదరు పత్రాన్ని సోమవారం వెంకట్‌రెడ్డికి అందజేశారు.

కార్ఖానాకుంటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత


కార్ఖానాకుంటలో వెలిసిన బేస్‌మెంట్‌లను కూల్చివేస్తున్న అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కార్ఖానా కుంట పరిధిలోని సర్వే నంబర్ 64లో వెలసిన అక్రమ నిర్మాణాలను ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కూల్చివేశారు. కార్ఖానా కుంట పరిధిలో వెలసిన 5 బేస్‌మెంట్‌లతోపాటు ఒక ప్రహరీ నిర్మాణం, కుంట్లూర్ పరిధిలోని బావికుంటలో వెలసిన ప్లాట్ల కడీలను ఇరిగేషన్ ఏఈ తస్వీన్‌రజా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ సహాయంతో నేలమట్టం చేశారు. ప్రభుత్వ భూమి, చెరువులు, కుంటల్లో నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


తన ఇంటి వద్ద నిరాహారదీక్ష చేస్తున్న ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు అశోక్, నిరుద్యోగులు

దిల్‌సుఖ్‌నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అశోక్ అకాడమీ నిర్వాహకుడు అశోక్ చైతన్యపురిలోని తన ఇంటి వద్ద సోమవారం నిరహారదీక్ష చేపట్టారు. ఆదివారం ఆయన దీక్షను చైతన్యపురి పోలీసులు భగ్నంచేసి, అదుపులోకి తీసుకున్నారు. దీంతో నిరుద్యోగులు ఆందోళనకు దిగిన విషయం విదితమే. ఈ క్రమంలో సోమవారం తన ఇంటి వద్ద నిరుద్యోగులతో కలిసి దీక్ష చేపట్టిన అశోక్ మాట్లాడుతూ మెగా డీఎస్సీ, టెట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులతో సమావేశం నిర్వహించన మాదిరిగానే నిరుద్యోగులతో కూడా సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. నిరుద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేసే వరకూ ఆమరణ నిరాహారదీక్ష కొనసాగుతుందని ఆయన తెలిపారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉప్పల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మలేషియా అంతర్జాతీయ శాఖ ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఆఫ్ ఎన్ఆర్ఐ కల్చరల్ అసోసియేషన్ ఉగాది పురస్కారాలు అందజేస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు డా.మిరియాల జానికిరామ వరప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్య, వైజ్ఞానిక, విజ్ఞాన, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, సేవా, సినీ, క్రీడా రంగాల్లో నిష్ణాతులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మార్చి 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఉగాదిని పురస్కరించుకుని మే 10న మలేషియాలోని కౌలాలంపూర్‌లో పురస్కారాలు అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగినవారు 9666910480 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

మద్యం మత్తులో యువకుడి వీరంగం

అడ్డుకోబోయిన కానిస్టేబుల్‌పై దాడి

హైదర్‌నగర్, మార్చి11(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు హోటల్ యజమానురాలితో పాటు అడ్డువచ్చిన పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం అర్ధరాత్రి భాగ్యనగర్ కాలనీ అర్జున్ థియేటర్ సమీపంలోని ఓ టిఫిన్స్ సెంటర్ దగ్గరకు రాజుయాదవ్ మద్యం మత్తులో వచ్చాడు. తనకు టిఫిన్ ఉచితంగా పెట్టాలని హోటల్ యజమాని కుమారిని డిమాండ్ చేశాడు. అందుకు ఆమె నిరాకరించడంతో ఆమెను దుర్భాషలాడుతూ ఆమెపై హెల్మెట్‌తో దాడిచేశాడు. స్థానికులు 100కు డయల్ చేసి ఫిర్యాదు చేయడంతో అక్కడికి చేరుకున్న కానిస్టేబుల్ శశికాంత్‌రెడ్డి, రాజుయాదవ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. మద్యం మత్తులో ఉన్న అతను కానిస్టేబుల్‌పై దాడిచేసి పిడిగుద్దులు కురిపించాడు. రాజుయాదవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ హోటల్ ప్రతి రోజూ అర్ధరాత్రి వరకు తెరిచి ఉండటంతో ఇక్కడ తరుచూ గొడవలు జరుగుతుంటాయి. రాత్రీ పగలూ తేడా లేకుండా హోటల్ నిర్వహించే నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావును కోరుతున్నారు.

'వార్డు'ల్లో ప్రజాపాలన సేవాకేంద్రాలు

- జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు సూచించిన ఎమ్మెల్యే బలాల
- కలెక్టర్ ఆదేశాలతో ఒకే..


ఆస్మాన్‌ఘడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే బలాలకు చూపిస్తున్న డిప్యూటీ డీఈవో రాధాకృష్ణ

ఓల్డ్‌మలక్‌పేట మార్చి11 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పులు సరిచేయడానికి ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవాకేంద్రాలను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఆయా వార్డుల్లో ఏర్పాటు చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే మహ్మద్‌బీన్ బలాల సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం ఆయన ఓల్డ్‌మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయంలో డీసీ జయంత్‌ను కలిసి సమస్య వివరించారు మలక్‌పేట నియోజకవర్గం మొత్తం 7 వార్డులకు ఒకేచోట సర్కిల్ కార్యాలయంలో కేంద్రాలను ఏర్పాటు చేశారని, దీంతో పేదలకు ఇబ్బందులు కలుగుతున్నాయని కోరారు. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల సూచనమేరకే సర్కిల్‌కార్యాలయంలో ఏర్పాటు చేశామని డీసీ ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే ఎమ్మెల్యే తన ఫోన్‌లో జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్‌కు సమస్య వివరించారు. ఎమ్మెల్యే సూచన మేరకు త్వరలోనే వార్డుకార్యాలయాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయాలని డీసీని కమిషనర్ ఆదేశించారు. దీంతో ప్రజాపాలన సేవాకేంద్రాలను మలక్‌పేట నియోజకవర్గంలోని 7 వార్డు కార్యాలయాల్లో త్వరలోనే ఏర్పాటు చేస్తామని డీసీ ఎమ్మెల్యేకు తెలిపారు.

ఆస్మాన్‌ఘడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలి

చాదర్‌ఘాట్: కేవలం 30 చదరపు గజాల స్థలంలో మూడంతస్తుల్లో మూడు గదులతో ఉన్న ఆస్మాన్‌ఘడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సమీపంలో ఉన్న బీ బ్లాక్స్ క్వార్టర్స్‌లో 300 చదరపు గజాల స్థలాన్ని కేటాయించాలని సైదాబాద్ డిప్యూటీ డీఈవో రాధాకృష్ణ ఎమ్మెల్యే అహ్మద్ బలాలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఆస్మాన్‌ఘడ్, గాంధీనగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలను సందర్శించి అక్కడి వసతులపై డిప్యూటీ డీఈవోను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి పాఠశాలకు సమీపంలోని బీ బ్లాక్‌లో గల ప్రభుత్వ ఖాళీ స్థలంలోని 3వందల చదరపు గజాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రతిపాదనలు తయారు చేసి అందజేయాలని సూచించారు. పరిమితమైన భవనంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం 80 మంది చిన్నారులు చదువుకుంటున్నారని, పాఠశాల మరోచోటకు మార్చితే సమీపంలో ఉన్న గాంధీనగర్ బస్తీ నుంచి కనీసం 150 మంది చిన్నారులు వచ్చే అవకాశం ఉందని డిప్యూటీ డీఈవో ఎమ్మెల్యేకు వివరించారు.

శివారుకాలనీల్లో ప్రతి ఇంటికీ తాగునీరు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): శివారు కాలనీల్లోని ప్రతి ఇంటికీ తాగు నీటిని సరఫరా చేయడానికి కృషి చేస్తున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. మాతృభూమి ఉత్సవ సమితి, సిటిజన్ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో నాగోల్ డివిజన్ ఇంద్రప్రస్థ కాలనీలో పరిసర 23 కాలనీల ప్రతినిధులతో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. డ్రైనేజీ లైన్లు లేని కాలనీల్లో నూతనంగా లైన్స్ వేస్తామని, మంచినీటి పైపులైన్ లేని కాలనీలకు కొత్తలైన్ల సదుపాయం కల్పించేందుకు ఇప్పకేటీ జలమండలి ఎండీతో మాట్లాడానని తెలిపారు. వీధి దీపాలు కూడా ఏర్పాటు చేస్తానని అన్నారు. అంతకు ముందు కాలనీవాసులు మాట్లాడుతూ.. ఆనందనగర్ నుంచి పతుల్లాగూడ వరకు రోడ్డు ఇరుకుగా మారటంతో నిత్యం ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోడ్డు విస్తరణ చేపట్టి సమస్య తీర్చాలన్నారు. మంచినీటిపైపులైన్ వ్యవస్థ, పాత డ్రైనేజీ స్థానంలో కొత్తలైన్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ రోడ్డు విస్తరణపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు.

వాకర్స్ క్లబ్ ఆఫ్ గ్రేటర్ దిల్‌సుఖ్‌నగర్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గుప్తా


వాకర్స్ క్లబ్ ఆఫ్ గ్రేటర్ దిల్‌సుఖ్‌నగర్ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్, ప్రతినిధులు

ఎల్‌బీనగర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వాకర్స్ క్లబ్ ఆఫ్ గ్రేటర్ దిల్‌సుఖ్‌నగర్ అధ్యక్షుడిగా దాచేపల్లి శ్రీనివాస్‌గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సరూర్‌నగర్ హుడా కాంప్లెక్స్‌లోని సీనియర్ సిటిజన్స్ భవన్‌లో క్లబ్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. దాచేపల్లి శ్రీనివాస్‌గుప్తాతో పాటు క్లబ్ ప్రధాన కార్యదర్శిగా చోలేటి ఆనంద్, కోశాధికారిగా నరసింహ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. క్లబ్ పూర్వఅధ్యక్షుడు జగిని శ్రీనివాస్‌గుప్తా నుంచి దాచేపల్లి శ్రీనివాస్‌గుప్తా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ 301 గవర్నర్ శ్రీనివాసచారి మాట్లాడుతూ నడక ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. వాకర్స్ క్లబ్ ఆఫ్ గ్రేటర్ దిల్‌సుఖ్‌నగర్ ఆధ్వర్యంలో మంచి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా నూతన ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు శివప్రసాద్, చక్రపాణి, లింగప్రకాష్, మాధవరావు, సంపత్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, గౌరీశంకర్, శ్రీనివాసచారి, మురళీకృష్ణ, వాకర్స్ క్లబ్ గ్రేటర్ దిల్‌సుఖ్‌నగర్ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.